క్లుప్తంగా

చిన్నారుల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యత


పెదవేగిలో అంగన్‌వాడీ సెక్టార్ సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పార్వతి

పెదవేగి : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని పెదవేగి సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్.పార్వతి అన్నారు. పెదవేగిలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ సెక్టార్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో బలహీనంగా ఉన్న చిన్నారులను గుర్తించి, వారికి మరింత బలమైన, అదనపు ఆహారాన్ని అందించి, ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వేసవి తీవ్రత నేపథ్యంలో చిన్నారులు ఎండబారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

భీమడోలు: భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నవోదయ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నవోదయ పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశానికి నిర్వహించిన ఈ పరీక్ష ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించారు. భీమడోలు, ద్వారకాతిరుమల, దెందులూరు మండలాలకు చెందిన 169 మంది విద్యార్థులకు 154 మంది హాజరయ్యారు. 91.12 శాతం నమోదైంది. పెదవేగికి చెందిన సెంటర్ లెవెల్ అధికారిణి పి. సుధా పర్యవేక్షించారు. చీఫ్ సూపరిండెంటెంట్‌గా టి.పుష్పావతి వ్యవహరించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

పెదపాడు: మండలంలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని పెదపాడు మండల తహసీల్దార్ ఎం విజయ్‌కుమార్ రాజు తెలిపారు. పెదపాడు గ్రామ సచివాలయంలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విజయకుమార్ రాజు అధికారులు, లబ్ధిదారులతో సమీక్ష నిర్వహించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇతర శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో పెదపాడు మండల పంచాయతీ విస్తరణాధికారి ఎస్ సూర్యకుమార్, హౌసింగ్ ఏఈ చైతన్య, ఈఓ వినోద్‌కుమార్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

భీమడోలులో మే డే వేడుకలకు ఏర్పాట్లు

భీమడోలు: ప్రపంచ కార్మి దినోత్సవం మేడే ఉత్సవాల్లో కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు కోరారు. పూళ్లలో శనివారం మేడే గోడ పత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమడోలు, పూళ్ల, గుండుగొలనులో మే 1వ తేదీన జెండాలను ఎగుర వేస్తారన్నారు. భీమడోలు జంక్షన్‌లో సోమవారం ఉదయం బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బెండి శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఏలూరు (టూటౌన్): చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఏలూరు తహసీల్దార్ కార్యాలయ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ నాగమణి పేర్కొన్నారు. పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక నవాబుపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలందరూ సమానంగా జీవించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు మేతర అజయ్ బాబు మాట్లాడుతూ రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకమైన చట్టాలు ఇచ్చారని, వీటిని అతిక్రమిస్తే శిక్షార్హులవుతారని చెప్పారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఆర్ఎస్ చాగంటి సంజీవ్, సాంఘిక సంక్షేమ శాఖ ఏఎస్‌డబ్ల్యూ కె.త్రిమూర్తులు, మెప్మా సీఓ శ్యాంప్రసాద్, బోడా కిరణ్, సచివాలయ అడ్మిన్ కుమార్, వీఆర్‌ఓ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ రిపేర్‌లో ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా నిరుద్యోగ యువకులకు సెల్‌ఫోన్ రిపేర్‌లో 30 రోజుల ఉచిత శిక్షణ ఏర్పాటు చేసినట్టు ఆ సంస్థ డైరెక్టర్ వై.భాను ప్రవీణ్ తెలిపారు. 8వ తరగతి ఆపైన విద్యార్హత గల 19 నుంచి 45 ఏళ్లలోపు వయసు గల గ్రామీణ ప్రాంత యువకులు అర్హులని, తమ వివరాలను ఫోన్‌ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు. శిక్షణా కాలంలో ఉచిత భోజన, వసతి ఏర్పాటు చేస్తామని తెలిపారు. అభ్యర్థులు నేరుగా సంస్థకు వచ్చి అడ్మిషన్ పొందాలని, ఆధార్, రేషన్ కార్డు జిరాక్సులు, మూడు కలర్ పాస్‌పోర్టు ఫొటోలు తీసుకురావాలని సూచించారు. వివరాలకు 99485 65256, 95027 23561 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

మార్టేరు మసూరి.. సార్వా సాగుకు అనుకూలం

- ఆశాజనకంగా ఎంటీయూ 1262 దిగుబడి
- తెగుళ్లు తట్టుకుంటున్న సన్నబియ్యం రకం

దెందులూరు: మార్టేరు మసూరి (ఎంటీయూ 1262) నూతన సన్నగింజ రకం సార్వాసాగుకు అనుకూలంగా ఉంది. సాంబ మసూరి రకానికి బదులుగా సార్వా సీజన్‌లో పురుగులు, తెగుళ్లను తట్టుకుని సన్నబియ్యం కోరుకునే మార్టేరు మసూరి రకం వరంగా ఉందని దెందులూరు నియోజకవర్గంలోని ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్న రైతులు చందు సత్తిబాబు, పామర్తి రాంబాబు అంటున్నారు. ఈ రకాన్ని మూడేళ్లుగా సార్వా కాలంలో సాగు చేస్తున్నారు.

మొదట చిరు సంచి దశ నుంచి రెండు కిలోల సంచుల విత్తనాన్ని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా క్షేత్రం మార్టేరు నుంచి సేకరించిన కోడి ఆనందరావు పొలంలో 10 సెంట్లలో నాటారు. ఏరువాక కేంద్రం ఏలూరు ఆధ్వర్యంలో ఈ రకం గుణగుణాలను మూడేళ్లు పరిశీలించారు. అనంతరం ఈ విత్తనం గుణగుణాలను మెచ్చి స్థానిక రైతులు సాగు చేసుకుంటున్నారు. వరి రకం ఎంటీయూ 1061తో బీపీటీ 5204తో పోల్చినప్పుడు పైరు పురుగులు దోమపోటు, ఎండాకు, మెడవిరుపు తెగుళ్లతోపాటు గాలి, వర్షాలను తట్టుకునే సామర్థ్యం కలిగిందని రైతులు గమనించారు. పంటకాల వ్యవధి ఆధారంగా 150–155 రోజుల్లో దిగుబడి వస్తుంది. రసాయనిక పద్ధతిలో ఎకరాకు 40–42 బస్తాలు, సేంద్రియ పద్ధతిలో ఎకరానికి 35–37 బస్తాల వరకు దిగుబడి వస్తోంది. ఖర్చు ఎకరాకు రూ. 25 వేల నుంచి 30 వేలు అవుతోంది.

గింజ సన్నగా ఉండటం వల్ల అన్నం, పులిహోర తయారీకి అనుకూలమని వివరిస్తున్నారు. ఈ రకం సాగుతో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను పొందవచ్చు. మార్టేరు మసూరి నూతన సన్న గింజ రకం నియోజకవర్గంలో పెదవేగి, ఏలూరు రూరల్ మండలాల్లో ఇప్పుడిప్పుడే సాగు చేస్తున్నారు.


మార్టేరు మసూరి (ఎంటీయూ 1262) రకం వరి

రైతులకు పరిశోధన కేంద్రాల తోడ్పాటు


గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు వ్యవసాయ పరిశోధనా కేంద్రాలు, వ్యవసాయ శాఖాధికారులు దిక్సూచిలా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. సమష్టి కృషితోనే సత్ఫలితాలు లభిస్తాయి. రైతులకు పరిశోధనా కేంద్రాలు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు.

– చందు సత్తిబాబు, రైతు

రైతులు సద్వినియోగం చేసుకోవాలి


మార్టేరు మసూరి విత్తనం భవిష్యత్తులో అన్ని ప్రాంతాల రైతులకు అందుబాటులో ఉంటుంది. భూసారం, కాపాడుకోవడం, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులపై రైతులంతా ఆసక్తి చూపుతున్నారు. రైతుభరోసా కేంద్రాలు, వ్యవసాయ పరిశోధనా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ ఫణి, సైంటిస్టు, ఏరువాక కేంద్రం, ఏలూరు

వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు


మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి


సమావేశంలో పాల్గొన్న ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికార్లు

ఉంగుటూరు: వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా ప్రజాప్రతినిధులు, అధికార్లు గ్రామాల్లో పర్యవేక్షించాలని ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి అన్నారు. శనివారం ఉంగుటూరులో మండల పరిషత్తు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ మాట్లాడుతూ మంచినీటి సమస్య పరిష్కారానికి అవసరమైతే నిధులు అందజేస్తామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామాల అభివృద్ధికి ఇప్పటికే రూ.60 లక్షలు కేటాయించమని వెల్లడించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికార్లు మంచినీటి సమస్య ఉత్పన్నం కాకుండా పర్యవేక్షించాలని సూచించారు. గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా ఉచితంగా ట్యాప్ వేయాల్సి ఉండగా కొందరు డబ్బులు వసూళ్ల చేయడం ఎంతవరకు సమంజసమని ఉప్పాకపాడు ఎంపీటీసీ మంగరాజు ప్రశ్నించారు. ఈ విషయంపై చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామారావు అన్నారు. ధాన్యం ఎగుమతి, సంచులు కొరత, లారీలు కేటాయింపుపై దృష్టి సారించాలని ఉంగటూరు ఎంపీటీసీ పెనుగొండ బాలకృష్ణ కోరారు. గ్రామాల్లో 104, 108 సేవలతోపాటు ఫ్యామిలీ డాక్టరు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సూచించారు. గ్రామ పంచాయతీకి నిధుల కొరత ఉందని వెల్లమిల్లి సర్పంచి కుమార్ రాజ అన్నారు. జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహనరెడ్డి రాష్ట్రాభివృద్ధికోసం, పేద ప్రజల సంక్షేమ కోసం పనిచేస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో ఉండే మనంకూడా పథకాలు అమలును పర్యవేక్షించాలని అన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఆంజనేయులు, డీటీ పోతురాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ మరడ రమావతి, వైస్ ఎంపీపీ శింగలూరి సూర్యనారాయణ వేదికను అలంకరించారు. హౌసింగు ఏఈ సురేష్ బాబు, వ్యవసాయశాఖ ఏవో వెంకటేష్, ఆయా శాఖల అధికార్లు సమావేశంలో మాట్లాడారు. ఎంపీటీసీ ఛాంబర్ అధ్యక్షుడు బండారు నాగరాజును సత్కరించారు.

ముఖ్యమంత్రి జగనన్న పాలనకు ప్రజల మద్దతు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: ప్రభుత్వ పారదర్శక పాలన, మా పని తీరే విజయానికి శ్రీరామరక్ష అని ప్రజలంతా జగనన్నే మా భవిష్యత్తు అని ముక్తకంఠంతో మద్దతు తెలుపుతున్నారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శనివారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం విజయవంతంగా ముగిసిన సందర్భంగా పార్టీ ముఖ్యులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు ఈనెల 7 నుంచి ఈ రోజు వరకూ నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 75 గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించామని, నియోజవర్గంలో మొత్తం 1.40 లక్షల కుటుంబాలు ఉండగా, 1.10 లక్షల కుటుంబాలను నేరుగా కలిసి ప్రభుత్వ పాలనా తీరుపై జనాభిప్రాయ సేకరణ ద్వారా వారి అభిప్రాయాలను తెలుసుకున్నామని వివరించారు. వీరిలో 90 శాతం మంది ప్రభుత్వ పాలనపై పూర్తి నమ్మకంతో, సానుకూల దృక్పథంతో ఉన్నారని అన్నారు. కలిసిన వారిలో 75 శాతం మంది నుంచి ప్రభుత్వం సూచించిన ఫోన్‌కు మిస్డ్ కాల్స్ వెళ్లాయన్నారు. ప్రజలంతా ముక్త కంఠంతో మా నమ్మకం నువ్వే జగన్ అంటున్నారని తెలిపారు. అందుకే తమ ఇళ్లకు అడిగి మరీ జగనన్న స్టిక్కర్లు అతికించుకుంటున్నారని తెలిపారు. పథకాల అమలుపై ప్రజలంతా పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 1,150 సమస్యలను తమ దృష్టికి తీసుకురాగా, అధికారులు, పార్టీ నాయకుల సహకారంతో సుమారు 950 సమస్యల వరకూ పరిష్కారించామన్నారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ దృష్టికి తీసుకురావచ్చునన్నారు. నియోజవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఇప్పటివరకూ 146 రోజులుగా నిర్విరామంగా సాగుతుందని, సుమారు. 65 గ్రామ సచివాలయాల పరిధిలో నూరుశాతం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించామన్నారు. మిగిలిన గ్రామాల్లోనూ గడపగడపకు కార్యక్రమం కొనసాగిస్తామన్నారు. ఈరెండు కార్యక్రమాలు నూరుశాతం విజయవంతం చేయడంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారం మరువలేనిదన్నారు. ఈ సమావేశంలో గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు మండలాల సచివాలయ కన్వీనర్లు మద్దాల రామకృష్ణ, నౌడు అచ్యుత రామారావు, పెనుగొండ బాలకృష్ణ, జిల్లా వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము, గణపవరం, నిడమర్రు మండలాల వైఎస్సార్ సీపీ కన్వీనర్లు దండు రాము, సంకు సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివాహితపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి రిమాండ్

భీమడోలు: ఓ వివాహితపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని భీమడోలు పోలీసులు శనివారం అరెస్ట్ చేసారు. సూరప్పగూడెంకు చెందిన బట్టు చిరంజీవి అదే గ్రామానికి చెందిన వివాహితపై శుక్రవారం లైంగిక దాడికి పాల్పడగా బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసారు. నిందితుడు బట్టు చిరంజీవికి 8 ఏళ్ల క్రితం వివాహం కాగా అతని భార్య ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన వివాహిత శనివారం పోలసానిపల్లి వెళ్లేందుకు బస్‌స్టాప్ వద్ద వేచి ఉండగా చిరంజీవి స్కూటీపై వచ్చి తాను వెళ్తున్నట్టు చెప్పి నమ్మించాడు. ఆమె స్కూటీపై ఎక్కగా చిరంజీవి వేగంగా నిర్మానుష్యంగా ఉన్న పామాయిల్ తోటలోని షెడ్డులోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడగా అతని నుంచి ఆమె తప్పించుకుని భీమడోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నిందితుడు చిరంజీవిపై కిడ్నాప్, అత్యాచారయత్నం కేసులను నమోదు చేసారు. స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని భీమడోలు కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్సై చావా సురేష్‌కుమార్ తెలిపారు.

3న సీనియర్ అథ్లెటిక్ జట్ల ఎంపిక

ఉంగుటూరు: మే 5న గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సీనియర్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే జిల్లా జట్టు ఎంపిక మే 3న బుధవారం ఉదయం 7గంటలకు గణపవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అథ్లెటిక్స్ అసోషియన్ కార్యదర్శి ఆదిరెడ్డి సత్యనారాయణ తెలిపారు. పాల్గొనే క్రీడాకార్లు తమ సర్టిఫికెట్లు పుట్టిన తేదీ, ఆధార్ కార్డు, రూ.100 ఎంట్రీ ఫీజు తప్పని సరిగా తీసుకురావాలని ఆయన తెలిపారు. వివరాలకు చింతకాయల సత్యనారాయణ(9133075602), దేవరపల్లి ప్రసాదు (6281431202) ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆదిరెడ్డి తెలిపారు.

చట్టం ముందు అందరూ సమానులే


రాజుపేటలో పౌర హక్కుల దినోత్సవంలో పాల్గొన్న అధికారులు

పెదపాడు: చట్టం ముందు అందరూ సమానమేనని ఎస్సీ, ఎస్టీ కమిటీ మెంబరు మేతర అజయ్‌బాబు తెలిపారు. పెదపాడు మండలంలోని రాజుపేటలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అజయ్‌బాబు పాల్గొన్నారు. తోటి వారి పట్ల వివక్ష చూపడం చట్టరీత్యా నేరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డీటీలు ఎన్‌వీడీవీ ప్రసాదరావు, నాగరాజు ఆర్ఐ గీతిక, డిజిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కత్తుల రవికుమార్, వీఆర్వో అక్కిలిశెట్టి మరళీ, పంచాయతీ కార్యదర్శి పూడి రాజేష్ పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి సహకారం అభినందనీయం


పూళ్లలో కైలాస గంగాస్నానాల రేవును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: పూళ్లలోని శ్మశాన వాటికను ఆహ్లాదకరంగా, సుందరంగా తీర్చిదిద్దిన దాతలు, ప్రజల సేవా గుణం అభినందనీయమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. పూళ్ల పంచాయతీ శివారు కొత్తపేటలోని శ్మశాన వాటిక ఆవరణలో దాతలు, వైసీపీ నేత పులిచర్ల వెంకటకృష్ణారావు సమకూర్చిన రూ.4లక్షలతో నూతనంగా నిర్మించిన కైలాస గంగ స్నానాల రేవు, శివలింగం, చుట్టూ ఫెన్సింగ్‌ను శనివారం ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ పూళ్లలో రూ.లక్షల వ్యయంతో శ్మశాన వాటికను వివిధ మొక్కలతో ఆహ్లాదకరంగా సుందరంగా తీర్చిదిద్దిన దాతలు, ప్రజల సహకారం మరువలేనిదన్నారు. కైలాసగిరిగా పేరుకు తగిన విధంగా అభివృద్ధి చేసేందుకు నిత్యం పాటుపడుతున్న వైసీపీ పులిచర్ల వెంకటకృష్ణారావు కృషి ఎనలేనిదన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా లేని విధంగా శ్మశాన వాటిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఇక్కడ స్నానాల రేవు, చుట్టూ ఫెన్సింగ్, శివలింగాలను ఏర్పాటు చేసారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి శ్రీనివాసరావు, మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, ఎఎంసీ వైస్ చైర్మన్ పులిచర్ల వెంకట కృష్ణారావు, నాయకులు పుప్పాల బుజ్జులు, యాసా వెంకటరామయ్య, ఎంఎస్ నాయుడు, కొత్తపేట గ్రామస్తులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలను పరామర్శించిన వాసుబాబు

ఉంగుటూరు: మండలంలోని ఎ.గోకవరం , కైకరం, నారాయణపురంలో ఇటీవల మృతిచెందిన వైసీపీ పార్టీ కార్యకర్తల కుటుంబాలను ఎమ్మెల్యే ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు శనివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అక్కుపల్లి గోకవరంలో దేవదాసు మరళి, దేవదాసు రవి, ఆకుల వెంకట సుబ్బారావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వాసుబాబు పరామర్శించారు. పూళ్లలో దాయం శాంతి పద్మలీల కుటుంబ సభ్యులను వాసుబాబు పరామర్శించారు. కై కరంలో సంపతి సత్యనారాయణ శానం రాఘవ కుటుంబాలను వాసుబాబు పరామర్శించారు. నారాయణపురంలో కవిటి సత్యనారాయణ, లంకన్న దానయ్య, దేల అప్పారావు, చీపురుపల్లి కనకమ్మ, మతుకుమిల్లి ఫణీంద్ర కుటుంబాల సభ్యులను ఆయన పరామర్శించారు. పార్టీ మండల కన్వీనర్ మరడ మంగరావు, నాయకులు కొరిపల్లి శ్రీను, పుప్పాలగోపి, పెనుగొండ బాలకృష్ణ, ఎ.గోకవరంలో వైసీపీ నాయకుడు మిద్దే వెంకటేశ్వరావు, కైకరంలో నక్కాశ్రీను, ఎంపీటీసీలు, నారాయణపురంలో పార్టీ నాయకులు బళ్ల త్రిమూర్తులు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పైడి అరణకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి


గుండుగొలనులో విజేతలను అభినందిస్తున్న టీచర్లు, పేరెంట్స్ కమిటీ సభ్యులు

భీమడోలు: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి సాధించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా అన్నారు. పోలసానిపల్లి, గుండుగొలను, ఎంఎంపురంలోని శనివారం ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ సమావేశాలు, చిన్నారులకు శనివారం విద్యా ప్రగతి పత్రాలను పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గుండుగొలను, ఎంఎంపురం గ్రామాల్లో విద్యార్థులకు ప్రగతి పత్రాలను అందించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీటీసీలు గంటా శ్రీనివాస్, బొల్లారపు జ్ఞానరమ్య పవన్‌లు, హెచ్‌ఎంలు పాశం పాండురంగారావు, కె.తులసి, జి.బాలభాస్కర్, మోహనరావు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పాల్గొన్నారు.

న్యాక్ గుర్తింపుపై అవగాహన

గణపవరం: న్యాక్ గుర్తింపు పొందేందుకు అవసరమైన 7 ముఖ్య విషయాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రధానాచార్యుడు, రిసోర్స్ పర్సన్ డా. వణుకూరి శ్రీనివాసరావు అన్నారు. శనివారం గణపవరం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఐక్యూసీ ఆధ్వర్యంలో న్యాక్ అసెస్మెంట్‌పై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. న్యాక్ గుర్తింపునకు అవసరమైన విద్యార్థుల ప్రగతి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కళాశాలలో వసతులు, అభివృద్ధి తదితర అంశాలపై తయారు చేయాల్సిన నివేదికలపై అవగాహన కల్పించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పి.మధురాజు, న్యాక్ కోఆర్డినేటర్ టి. అక్కిరాజు, జి.వెంకట్రావు, వెంకన్నబాబు, చైతన్య, షేక్‌పర్వీన్, బాలమణికంఠ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ ఇంట్లో తనిఖీ

పెదపాడు: మండలంలోని సత్యవోలు గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ ఇంట్లో మద్యం విక్రయిస్తున్నట్టు సమాచారం రావడంతో పెదపాడు పోలీసులు తనిఖీ చేసారు. రెండు రోజుల క్రితం 54 సీసాల మద్యం లభించడంతో భర్తపై కేసు నమోదు చేసారు. అయినప్పటికీ మద్యం అమ్మకాలు కొనసాగిస్తూ ఇంట్లో సిట్టింగ్ నిర్వహిస్తున్నారని స్థానికులు పలు మార్లు ఫిర్యాదు చేయడంతో శనివారం పెదపాడు పోలీసులు తనిఖీలు చేపట్టారు. తనిఖీకి పోలీసులు వస్తున్నారని తెలిసి మందుబాబులు పరారైనట్టు స్థానికులు తెలిపారు.

ఆకాశం మేఘావృతం.. రైతుల గుండెల్లో గుబులు


భీమడోలులో రోడ్డు వెంబడి ఉన్న ధాన్యం రాశులు


ధాన్యం రాశిపై బరకాలు కప్పుతున్న రైతు

భీమడోలు: కొన్ని రోజులు అకాల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతులు గుండెల్లో గుబులు రేగుతోంది. శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృత్తం కావడంతో రైతన్నలు ఆందోళన చెందారు. ధాన్యం రాశుల వద్దకు పరుగులు తీసారు. మాసూళ్లు పూర్తి చేసుకుని మిల్లుల వద్దకు ధాన్యాన్ని తరలించేందుకు రైతులు ఎదురు చూస్తున్నారు. రోడ్లపై, కళ్లాలపై, ఎక్కడ జాగా దొరికితే అక్కడ రైతులు ధాన్యాన్ని నెట్లు కట్టి కాపలా కాస్తున్నారు. ప్రతి రోజూ రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసుకుని సాయంత్రం వాటిని బస్తాల్లో భద్రపర్చుకోవడం రైతులకు నిత్యకృత్యంగా మారింది. ఈ క్రమంలో ఆకాశమంతా మబ్బులు కమ్మి ఉరుములు, మెరుపులతో వాతావరణమంతా ఒక్కసారిగా మారింది. చినుకులు కురవడంతో రైతులు ధాన్యం రాసుల వద్దకు పరుగులు పెట్టారు. ధాన్యాన్ని బరకాలతో భద్రపర్చారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, సూరప్పగూడెం, పాతూరు తదితర గ్రామాల్లోని హైవేలపై ఆరబోసుకున్న రైతులు ఆందోళన చెందారు. మండల వ్యాప్తంగా 13వేల ఎకరాల్లో ఇప్పటి వరకు 3వేల ఎకరాల్లో ధాన్యం మాత్రమే మిల్లుల వద్దకు చేరింది. మిగిలిన ధాన్యమంతా రైతుల వద్దనే ఉంది. వర్షం వస్తే ధాన్యం నాశనమవుతుందని రైతులు ఆందోళన చెందారు.

రైతన్నల ఉరుకులు, పరుగులు

గణపవరం: దాళ్వాసాగు చివరి దశలో వాతావరణం రైతులను బెంబేలెత్తిస్తోంది. పంట చేతికందిన సమయంలో అకాల వర్షాలు పడుతూ రైతన్నకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. పంటను కాపాడుకోవడానికి రైతులు ధాన్యం రాశులవద్ద ప్లాస్టిక్ బరకాలు, టార్పాలిన్‌లతో కాపలా కాస్తున్నారు. పూటకోరకంగా మారుతున్న వాతావరణం రైతుల గుండెల్లో గుబులు రేపుతోంది. శనివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారి, ఆకాశం మేఘావృత్తమై ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసి రైతులు ఉరుకులు పరుగులు పెట్టించింది. కొన్ని చోట్ల ఎండబెట్టిన ధాన్యం తడిసిపోగా ఇప్పటికే పూర్తిగా ఆరిన ధాన్యం రాశులను రైతులు బరకాలు, టార్పాలిన్‌లతో కప్పి భద్రపర్చారు. ఇప్పటికే 50 నుంచి 60 శాతం రైతులు తమ ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. గణపవరం, నిడమర్రు మండలాలలో దాదాపు 13 వేల ఎకరాలలో దాళ్వా సాగు చేశారు. ఇంకా 15శాతం పట కోత కోయాల్సి ఉంది. ఈ వారంలో నూరుశాతం మాసూళ్లు పూర్తవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మరో వారం రోజుల పాటు వాతావరణం అనుకూలిస్తే బయటపడతామని రైతులు చెబుతున్నారు.